నాలుగు దశల్లో 67% పోలింగ్: ఈసీ

న్యూఢిల్లీ, మే 16: లోక్‌సభ ఎన్నికల్లో మొదటి నాలుగు దశల్లో 66.95 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. మొత్తం 97 కోట్ల ఓటర్లలో 45.10 కోట్ల మంది ఓటు వేశారని తెలిపింది. నాలుగో దశలో 69.16 శాతం పోలింగ్ (2019 ఎన్నికల కంటే 3.65 శాతం ఎక్కువ) నమోదైందని ఈసీ తెలిపింది. మొదటి దశలో 66.14 శాతం (గత ఎన్నికల్లో 69.64 శాతం), రెండో దశలో 66.71 శాతం (గతంలో 69.64), మూడో దశలో 65.68 శాతం (గతంలో 69.64) పోలింగ్ నమోదైంది. వివిధ సంస్థలతో పోలింగ్ శాతం పెంపునకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

కాంగ్రెస్‌కు కఠిన పరీక్ష!

- ఐదో విడతలో యూపీలో 14 స్థానాలకు పోలింగ్
- కాంగ్రెస్ కంచుకోటలు బరేలీ, అమేథీలకూ ఈ దశలోనే
- రాయ్‌బరేలీ బరిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- గత ఎన్నికల్లో 13 స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ
- ఈసారి మాత్రం గట్టి పోటీ ఎదుర్కొంటున్న కమలం పార్టీ

లక్నో, మే 16: కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలో నిర్ణయించే రాష్ట్రాల్లో మొదటిది ఉత్తరప్రదేశ్. 2014, 2019 ఎన్నికల్లో యూపీలో బీజేపీ మంచి ఫలితాలను అందుకుంది. రాష్ట్రంలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు గానూ 2014 ఎన్నికల్లో 71 స్థానాలను, 2019లో 62 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఈసారి మాత్రం బీజేపీకి ఇండియా కూటమి నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నది. ముఖ్యంగా సమాజ్‌వాదీ పార్టీ.. బీజేపీకి మెజారిటీ స్థానాల్లో బలమైన పోటీ ఇస్తున్నది. మరోవైపు, కాంగ్రెస్‌కు ఈ విడతలో కఠిన పరీక్ష ఎదురుకానున్నది. పార్టీ కంచుకోటలైన అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలకు ఈ దశలోనే ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మే 20న యూపీలో 14 స్థానాలకు జరుగనున్న ఐదో దశ ఎన్నికలు కీలకంగా మారాయి. ఈ 14 స్థానాల్లో గత ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 13 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ సహా ఐదుగురు కేంద్రమంత్రులు ఈ దశలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

కాంగ్రెస్ కోటల్లో గట్టి పోటీ

ఐదో దశలో ఎన్నికలు జరుగనున్న స్థానాల్లో కాంగ్రెస్‌కు కంచుకోటల్లాంటి రాయ్‌బరేలీ, అమేథీ స్థానాలు ఉన్నాయి. ముఖ్యంగా గాంధీ కుటుంబానికి ముందునుంచీ అండగా నిలిచిన స్థానాలివి. వీటిల్లో అమేథీని గత ఎన్నికల్లోనే కాంగ్రెస్ కోల్పోయింది. ఇక్కడ రాహుల్ గాంధీపై బీజేపీ అభ్యర్థిగా స్మృతి ఇరానీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈసారి అమేథీలో రాహుల్ గాంధీ పోటీ నుంచి తప్పుకొని రాయ్‌బరేలీ నుంచి బరిలో నిలిచారు. అమేథీలో కాంగ్రెస్ తరపున కేఎల్ శర్మ.. స్మృతి ఇరానీపై పోటీ చేస్తున్నారు. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీపై బీజేపీ అభ్యర్థిగా దినేశ్ ప్రతాప్ సింగ్ పోటీ చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపికపై చివరివరకూ నాన్చిన కాంగ్రెస్.. ఈ రెండు స్థానాలను తిరిగి గెలుచుకోగలదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

బీజేపీకి కీలక స్థానాలు

ఐదో దశలో ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో లక్నో నుంచి రాజ్‌నాథ్ సింగ్ మూడోసారి పోటీ చేస్తున్నారు. ఆయనపై ఎస్పీ అభ్యర్థిగా రవిదాస్ మెహ్రోత్రా బరిలో ఉన్నారు. మరో కేంద్రమంత్రి కౌశల్ కిశోర్.. మోహన్‌లాల్‌గంజ్ నుంచి పోటీ చేస్తుండగా ఆయనకు ఎస్పీ అభ్యర్థిగా ఆర్కే చౌదరి గట్టి పోటీ ఇస్తున్నారు. జలౌన్ స్థానం నుంచి కేంద్రమంత్రి భానుప్రతాప్ సింగ్ వర్మ ఆరోసారి విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఫతేహ్‌పూర్ నుంచి మరో కేంద్ర మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి పోటీ చేస్తుండగా ఆమెకు ఎస్పీ కీలక నేత నరేశ్ ఉత్తమ్ పటేల్ బలమైన ప్రత్యర్థిగా బరిలో నిలిచారు. కౌషంభి నుంచి బీజేపీ సిట్టింగ్ ఎంపీ వినోద్ సోంకర్‌పై 25 ఏండ్ల యువకుడు పుష్పేంద్ర సరోజ్ పోటీ చేస్తున్నారు. ఇక, రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ కైసర్‌గంజ్ నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనపై ఎస్పీ అభ్యర్థిగా భగత్ రామ్ మిశ్రా పోటీ చేస్తున్నారు. ఇవే కాకుండా ఝాన్సీ, హమీర్‌పూర్, బాండ, బారాబంకి, ఫైజాబాద్, గోండా స్థానాలకు ఐదో దశలో పోలింగ్ జరగనుంది.

ఈడీ పవర్స్‌కు సుప్రీం కత్తెర!

> మొదటిపేజీ తరువాయి...

చేసింది. ఒకవేళ సదరు నిందితుడిని కస్టడీలోకి తీసుకోవాలంటే.. ఈడీ తప్పనిసరిగా ప్రత్యేక కోర్టు అనుమతి తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. పీఎంఎల్‌ఏ సెక్షన్ 45కి సంబంధించి 'ట్విన్ టెస్ట్ ఫర్ బెయిల్'పై ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది.

సుప్రీంకోర్టు తీర్పులోని ప్రధానాంశాలు

- మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) సెక్షన్ 44 కింద దాఖలైన ఫిర్యాదులను ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరిస్తే.. ఆ కేసుల్లో నిందితుడిని సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారం ఈడీకి ఉండదు.
- ఇలాంటి కేసుల్లో ప్రత్యేక కోర్టు నిందితుడికి తప్పనిసరిగా సమన్లు జారీ చేయాలి.
- కోర్టు నోటీసులకు నిందితుడు సమాధానమిచ్చినట్లయితే, అప్పుడు నిందితుడు కస్టడీలో ఉన్నట్లుగా పరిగణించకూడదు. కాబట్టి, నిందితుడు ప్రత్యేకంగా బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.
- ఇలాంటి కేసుల్లో నిందితుడు పీఎంఎల్‌ఏ సెక్షన్ 45లోని ట్విన్ టెస్ట్ ఫర్ బెయిల్‌ను సంతృప్తి పర్చాల్సిన అవసరమూ ఉండదు.
- ఒకవేళ, కోర్టు నోటీసులకు నిందితుడు సమాధానం ఇవ్వకుంటే, అరెస్టు వారెంట్ జారీ చేయాలి. తొలిసారి జారీ చేసే వారెంట్ బెయిలబుల్ వారెంట్‌గా ఉండాలి.
- కోర్టు విచారణకు హాజరైన నిందితుడిని దర్యాప్తులో భాగంగా ఈడీ కస్టడీకి తీసుకోవాలనుకుంటే.. అప్పుడు ప్రత్యేక కోర్టులో దరఖాస్తు చేసుకోవాలి.
- దీనిపై న్యాయస్థానం విచారణ జరుపుతుంది. ఈడీ చూపించిన కారణాలతో కోర్టు సంతృప్తి చెందితేనే కస్టోడియల్ విచారణకు అనుమతినివ్వాలి.

ఏమిటీ కేసు?

మనీలాండరింగ్ ఫిర్యాదును ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించిన తర్వాత కూడా సదరు కేసులోని నిందితుడు బెయిల్ కోసం పీఎంఎల్‌ఏ సెక్షన్ 45లోని కఠినమైన రెండు పరీక్షలను (ట్విన్ టెస్ట్ ఫర్ బెయిల్) నెగ్గాలా? అంటూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం జడ్జిమెంట్‌ను వెలువరించింది.

ఏమిటీ ట్విన్ టెస్ట్ ఫర్ బెయిల్?

మనీలాండరింగ్ కేసులో నిందితుడు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకొంటే, దాన్ని పొందడానికి పీఎంఎల్‌ఏ సెక్షన్ 45 ప్రకారం.. రెండు పరీక్షలను నెగ్గాల్సి ఉంటుంది. అందులో మొదటిది.. నిందితుడికి బెయిల్ ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు ముందు సమ్మతించాలి. రెండోది.. అప్పటివరకూ జరిగిన విచారణలో నిందితుడు దోషిగా తేలకూడదు. అలాగే, బెయిల్‌పై బయటకు వచ్చినప్పటికీ ఎలాంటి ఆర్థిక నేరాలకు సదరు నిందితుడు పాల్పడబోడని కోర్టు నమ్మాలి. ఈ రెండు పరీక్షల్లో నిందితుడు పాస్ అయితేనే, ఈ తరహా కేసుల్లో నిందితులకు బెయిల్ మంజూరవుతుంది.

ఇప్పటివరకూ అలా.. ఇకపై ఇలా..

మనీలాండరింగ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆధారాలను బట్టి సదరు వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని విశ్వసిస్తే అప్పుడు సెక్షన్ 19 కింద నిందితుడిని ఈడీ అధికారులు అరెస్టు చేసేవారు. కోర్టు సమన్లకు నిందితులు సమాధానమివ్వడానికి ముందే ఈ అరెస్టులు జరిగేవి. కానీ సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పును బట్టి.. పీఎంఎల్‌ఏకు సంబంధించిన ఫిర్యాదులను ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరిస్తే, నిందితుడిని అరెస్టు చేయాలంటే ఈడీ ముందుగా ప్రత్యేక కోర్టు అనుమతిని తీసుకోవాల్సి ఉంటుంది.

బీజేపీకి రైతుల సెగ

- పంజాబ్‌లో ఆ పార్టీ అభ్యర్థులకు ముప్పతిప్పలు
- నేతల ప్రచారం అడ్డుకుంటున్న అన్నదాతలు
- తమ డిమాండ్లపై ఎక్కడికక్కడ నిలదీత
- అదుపు చేయలేక తల పట్టుకుంటున్న పోలీసులు
- నిరసనలు కొనసాగిస్తూనే ఉంటామన్న రైతులు

పాటియాల, మే 16: పంజాబ్‌లో బీజేపీ అభ్యర్థులకు రైతుల నుంచి తీవ్ర నిరసన సెగ ఎదురవుతున్నది. కమలం పార్టీల అభ్యర్థుల ప్రచారాన్ని అన్నదాతలు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. గ్రామాల్లోకి బీజేపీ అభ్యర్థులను రానివ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. తమ డిమాండ్లపై ఆ పార్టీ నేతలను నిలదీస్తున్నారు. ప్రచారం అడ్డుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇటీవల ఎన్నికల సంఘానికి రైతులపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రైతు సంఘాల నేతలతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ రైతులు వెనక్కి తగ్గలేదు. బీజేపీ నేతల ప్రచారాన్ని అడ్డుకుంటూనే ఉన్నారు. గత వారం వ్యవధిలో ఇలాంటి కేసులు 24 నమోదయ్యాయి. రైతులను అదుపు చేయలేక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

బీజేపీ నేతలందరిదీ ఇదే పరిస్థితి

బుధవారం బీజేపీ నేత ప్రణీత్ కౌర్ పర్యటన సందర్భంగా నిరసన తెలపడానికి రైతులు ప్రయత్నించారు. దీనిని పోలీసులు గట్టిగా అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఒక రైతు తలపాగా ఎగిరిపోవడంతో పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ రైతులు ధర్నాకు దిగడంతో ఆ కార్యక్రమం రసాభాసగా మారింది. ఇది ఒక్క ప్రణీత్ కౌర్‌కే కాదు. అన్ని నియోజవకర్గాల్లోని బీజేపీ అభ్యర్థులకు ఇదే పరిస్థితి ఏర్పడుతున్నది. దీనిపై లా అండ్ ఆర్డర్ స్పెషల్ డీజీపీ అర్పిత్ శుక్లా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు రైతులుకు ఉందని, అయితే అదే సమయంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అభ్యర్థులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్న విషయాన్ని మరువరాదని అన్నారు.

త్వరలో ప్రధాని, అమిత్ షాల పర్యటన

ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాల పర్యటన త్వరలో ఉండటంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అనూహ్య ఘటనలు జరగకుండా తగిన సిబ్బందిని మోహరించాలని నిర్ణయించింది. ముఖ్యంగా వీరి సభల్లో నిరసనలు, నిలదీతలు, వాగ్వాదాలు లాంటివి చోటుచోసుకోకుండా ముందస్తు వ్యూహాలను అమలు చేస్తున్నారు. పోలీసులు ఇంత పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నా రైతులు వేదికల వద్దకు చేరుకుని అలజడి సృష్టించడం ఖాయమన్న భయం అటు నేతల్లో, ఇటు పోలీసుల్లో ఉంది.

కేజ్రీవాల్ సహాయకుడిపై కేసు

- మలివాల్‌పై దాడి ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు
- నిందితుడిగా బిభవ్ కుమార్
- సుమోటోగా తీసుకున్న ఎన్‌సీడబ్ల్యూ
- నేడు విచారణకు రావాలని సమన్లు
- మీడియా ప్రశ్నలకు కేజ్రీవాల్ మౌనం
- మణిపూర్, ప్రజ్వల్‌పై మాట్లాడండి: ఆప్

న్యూఢిల్లీ/లక్నో, మే 16: ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్‌పై దాడి ఘటనలో ఢిల్లీ పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌ను నిందితుడిగా చేర్చారు. అంతకుముందుగా పోలీసులు మలివాల్ ఇంటికి వెళ్లి ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. కాగా, ఈ ఘటనను జాతీయ మహిళా కమిషన్ సైతం సుమోటోగా తీసుకుంది. బిభవ్ కుమార్‌కు గురువారం సమన్లు జారీ చేసింది. శుక్రవారం విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించింది. దాడి వ్యవహారంపై మలివాల్ ట్వీట్ చేశారు. ఈ ఘటనపై సరైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నానని, తన పట్ల జరిగింది తీవ్రమైన తప్పిదమని ఆమె పేర్కొన్నారు. గడిచిన కొన్ని రోజులు తనకు చాలా కఠినమైనవని, తన వ్యక్తిత్వ హననానికి ప్రయత్నించారని, వారికి కూడా దేవుడి ఆశీస్సులు ఉండాలని అన్నారు.

బిభవ్

ఘటనపై నోరెత్తని కేజ్రీవాల్

మలివాల్‌పై దాడి ఘటనలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మౌనం వహించారు. గురువారం లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలిసి ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు. స్వాతి మలివాల్ ఘటనపై మీడియా ప్రశ్నించగా.. ఆయన సమాధానం ఇవ్వలేదు. అఖిలేశ్ యాదవ్ మైక్ తీసుకొని.. అడగడానికి ఇంకా ముఖ్యమైన ప్రశ్నలు ఉన్నాయని సూచించారు. తర్వాత ఆప్ నేత సంజయ్ సింగ్ స్పందిస్తూ.. మణిపూర్‌లో కార్గిల్ యుద్ధవీరుడి భార్యను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధాని మోదీ ఇప్పటికీ నోరెత్తడం లేదని, వేలాది మంది మహిళలపై లైంగికదాడికి పాల్పడిన ప్రజ్వల్ రేవణ్ణను దేశం దాటేందుకు బీజేపీ అనుమతించిందని ప్రత్యారోపణలు చేశారు. జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు ఆందోళన చేసినప్పుడు స్వాతి మలివాల్ అక్కడికి వెళ్తే ఆమెను పోలీసులు ఈడ్చేశారని, కొట్టారని గుర్తు చేశారు.

కేజ్రీవాల్ రాజీనామాకు బీజేపీ డిమాండ్

మలివాల్‌పై దాడి ఘటనకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయాలని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ డిమాండ్ చేశారు. ఈ దాడి ఘటనలో కేజ్రీవాలే ప్రధాన నేరస్థుడని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. ముఖ్యమంత్రి కంటే ఎక్కువగా కేజ్రీవాల్ గూండా అని విమర్శించారు.

మేం ఎవరికీ మినహాయింపు ఇవ్వలేదు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు స్పందన

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంపై జరుగుతున్న రాజకీయ చర్చపై గురువారం సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. తాము ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదంది. తమ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటేస్తే, జూన్ 2న తాను జైలుకు తిరిగి వెళ్లాల్సిన అవసరం ఉండదని కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో అంటున్నారని ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ అది ఆయన ఊహ అని.. దానిపై తామేమీ వ్యాఖ్యానించలేమని చెప్పింది. కేజ్రీవాల్ ఎక్కడా జైలుకు తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించ లేదని ఆయన లాయర్ సింఘ్వీ కోర్టుకు తెలిపారు.

మోదీకి పోటీగా ఉండనివ్వట్లే!

- నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని పలువురు అభ్యర్థులకు బెదిరింపులు
- వారణాసిలో భయానక పరిస్థితులు
- జ్యోతిర్మఠ్ శంకరాచార్యులు ఆరోపణ
- వారణాసి స్థానానికి 43 నామినేషన్లు
- ఏకంగా 36 నామినేషన్ల తిరస్కరణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పోటీగా బరిలో ఎవరూ ఉండకుండా కుట్రలు జరుగుతున్నాయని జ్యోతిర్మఠ్ శంకరాచార్యులు స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సంచలన ఆరోపణలు చేశారు. వారణాసి ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా దిగుదామనుకొన్న వారిని వారణాసి మేయర్ బెదిరిస్తున్నట్టు మండిపడ్డారు. నామినేషన్ దాఖలు చేసిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు పేర్కొన్నారు. నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకోవాలంటూ అర్ధరాత్రి పూట అభ్యర్థుల ఇండ్ల తలుపులు కొడుతున్నట్టు ధ్వజమెత్తారు. ఇవన్నీ చూస్తే, వారణాసిలో భయానక వాతావరణం కొనసాగుతున్నట్టు అర్థమవుతున్నదని వాపోయారు. అసలు దేశంలో ప్రజాస్వామ్యం కనిపించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

అవిముక్తేశ్వరానంద

43 మందిలో.. మిగిలింది ఏడుగురే

వారణాసి ఎంపీ స్థానానికి మంగళవారంతో నామినేషన్ల గడువు ముగిసింది. మొత్తం 43 నామినేషన్లు వచ్చాయి. అయితే, వివిధ కారణాలతో 36 నామినేషన్లను ఈసీ తిరస్కరించింది. తిరస్కరించిన నామినేషన్లలో ప్రముఖ కమెడియన్ శ్యామ్ రంగీలాది కూడా ఉంది. గురువారం నాటికి ప్రధాని మోదీకి పోటీగా ఆరుగురు మాత్రమే బరిలో ఉన్నారు.

కొవిషీల్డ్‌తో రక్తం గడ్డకట్టే ముప్పు

ఆస్ట్రేలియా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

ప్రస్తుతానికి ఆందోళన అక్కర్లేదన్న ఏఎస్‌ఓహెచ్

సిడ్నీ, మే 16: కొవిషీల్డ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో వ్యాక్సిన్-ఇండ్యూస్డ్ ఇమ్యూన్ థ్రోంబోసైటోపెనియా అండ్ థ్రోంబోసిస్(వీఐటీటీ) అనే సమస్య ఉత్పన్న మయ్యే ముప్పు ఉందని ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. వీఐటీటీ బారిన పడ్డ వారిలో మెదడు, పొత్తికడుపు వంటి శరీరంలోని పలు చోట్ల రక్తం గడ్డ కట్టే ముప్పు ఉంటుంది. ఈ అధ్యయనం వివరాలు న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత శరీరంలో వైరస్‌ను ఎదుర్కొనే యాంటీబాడీలు ఉత్పత్తి అవుతాయి. ఎప్పుడైనా వైరస్ ఒంట్లోకి ప్రవేశిస్తే ఈ యాంటీబాడీలు వెంటనే అప్రమత్తమై వైరస్ మీద దాడి చేసి అంతం చేస్తాయి. అయితే, కొన్నిసార్లు బయటి నుంచి వచ్చిన వైరస్ అనుకొని శరీరంలోని ఆరోగ్యకరమైన కణాలు, కణజలాలపై కూడా కొన్ని ఆటోయాంటీబాడీలు దాడి చేస్తాయి. ఇలా శరీరంలోని ప్లేట్‌లెట్ ఫ్యాక్టర్ 4(పీఎఫ్4) అనే ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఒక హానికరమైన ఆటోయాంటీబాడీనే వీఐటీటీకి కారణమవుతున్నదని పరిశోధకులు గుర్తించారు. కాగా, వీఐటీటీ గురించి కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారు ఆందోళన చెందాల్సిన పని ఇప్పుడు లేదని నిపుణులు చెప్తున్నారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ హెమటాలజీ ప్రకారం.. వీఐటీటీ అనేది కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న నాలుగు రోజుల నుంచి 42 రోజుల మధ్యమాత్రమే ఉత్పన్నమవుతుంది. వీఐటీటీ సమస్య వచ్చిన వారిలో తీవ్ర తలనొప్పి, పొత్తికడుపు నొప్పి, వికారం, వాంతులు, వెన్ను నొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొవాగ్జిన్‌తోనూ సైడ్ ఎఫెక్ట్స

- 30 శాతం మందికి అనారోగ్య సమస్యలు
- ఎక్కువమందిలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు
- 0.3 శాతం మందికి హార్ట్ స్ట్రోక్ ముప్పు
- బీహెచ్‌యూ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, మే 16: కొవిషీల్డ్ తీసుకున్న వారిలో తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయనే ఆందోళనలు కొనసాగుతుండగానే కొవాగ్జిన్‌పై జరిగిన ఓ అధ్యయనంలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొవిడ్‌కు విరుగుడుగా భారత్ బయోటెక్ తయారుచేసిన కొవాగ్జిన్ తీసుకున్న వారిలో దాదాపు 30 శాతం మంది వేర్వేరు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడ్డారని బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి(బీహెచ్‌యూ) చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనంలో వెల్లడైంది. కొవాగ్జిన్ తీసుకున్న 635 మంది యుక్తవయస్కులు, 291 మంది పెద్దవారిపై ఈ అధ్యయనం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు 'ప్రింగర్ నేచర్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. కొవాగ్జిన్ అందుకున్న ప్రతి ముగ్గురిలో ఒకరు అనారోగ్య సమస్యలకు గురైనట్టు పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న 304 మంది(47.9 శాతం) యుక్తవయస్కులు, 124 మంది(42.6 శాతం) మంది పెద్ద వయసు వారు శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల బారిన పడ్డారు. యుక్తవయస్కుల్లో 10.5 శాతం మంది చర్మ సంబంధ రుగ్మతలను ఎదుర్కొన్నారు. 10.2 శాతం మంది సాధారణ అనారోగ్య సమస్యలు, 4.7 శాతం మంది నాడీవ్యవస్థకు సంబంధించిన ఇబ్బందులకు గురయ్యారు. పెద్ద వారిలో 8.9 శాతం మంది సాధారణ రుగ్మతలు, 5.8 శాతం మంది మస్కులోస్కెలిటల్ సమస్యలు, 5.5 శాతం మంది నాడీ వ్యవస్థ సమస్యలను ఎదుర్కొన్నారు. 4.6 శాతం మంది మహిళలకు రుతుక్రమానికి సంబంధించి సమస్యలు వచ్చాయి. 2.7 శాతం మందిలో కంటి సమస్యలు, 0.6 శాతం మందిలో హైపోథైరాయిడిజం వచ్చినట్టు గుర్తించారు.

వెయ్యి మందిలో ముగ్గురికి స్ట్రోక్ ముప్పు

కొవాగ్జిన్ తీసుకున్న 0.3 శాతం మందిలో స్ట్రోక్, 0.1 శాతం మందిలో గులియన్-బారే సిండ్రోమ్ లాంటి తీవ్ర సైడ్ ఎఫెక్ట్స్‌ను గుర్తించారు. రెండు డోసులు తీసుకున్న వారిలో కంటే మూడు డోసులు తీసుకున్న వారిలో సైడ్ ఎఫెక్ట్స్ తీవ్రత నాలుగింతలు, ఒక డోసు తీసుకున్న వారిలో రెండింతలు ఎక్కువ ఉన్నట్టు గుర్తించారు. కొవాగ్జిన్ తీసుకున్న 926 మందిపై ఈ అధ్యయనం జరగగా వీరిలో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు మరణించారు. కొవాగ్జిన్‌తో ఎక్కువ సైడ్ ఎఫెక్ట్స్ చాలాకాలం పాటు కొనసాగుతున్నందున ఆలస్యంగా వచ్చే సైడ్ ఎఫెక్ట్స్‌ను అర్థం చేసుకునేందుకు వ్యాక్సిన్ తీసుకున్న వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం సూచించింది.

కొవాగ్జిన్ సురక్షితం: భారత్ బయోటెక్

ఈ అధ్యయనంపై కొవాగ్జిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ స్పందించింది. కొవాగ్జిన్‌పై అనేక అధ్యయనాలు జరిగాయని, ఈ వివరాలన్నీ ప్రఖ్యాత జర్నళ్లలో ప్రచురిత మయ్యాయని పేర్కొన్నది. అన్ని అధ్యయనాలూ కొవాగ్జిన్ సురక్షితమైనదని తేల్చాయని తెలిపింది. వాక్సిన్‌పై జరిగే అధ్యయనం ప్రభావవంతంగా, పూర్తి సమాచారంతో ఉండాలని, పరిశోధకులకు పక్షపాతం ఉండొద్దని పేర్కొన్నది.

రూ.170 కోట్లు సాత్తు సీజ్

నాందేడ్‌లో ఫైనాన్స్ సంస్థలపై ఐటీ దాడులు

ముంబై, మే 16: లోక్‌సభ ఎన్నికల వేళ మహారాష్ట్రలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు కోట్లాది రూపాయల అక్రమ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారన్న ఆరోపణతో నాందేడ్‌లోని భండారి ఫైనాన్స్, అదినాథ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లపై దాడులు జరిపి లెక్కల్లో మాపని రూ.170 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.140 కోట్ల నగదుతో పాటు 8 కేజీల బంగారం కూడా ఉన్నది. స్వాధీనం చేసుకున్న నగదును లెక్క పెట్టడానికి అధికారులకు 14 గంటల సమయం పట్టింది. మే 10న వందలాది మంది ఆదాయపు పన్ను శాఖ అధికారులు పలు ప్రాంతాల్లోని ఈ సంస్థల కార్యాలయాలు, వాటి యజమానుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు చేశారు.

తగ్గనున్న డయాబెటిస్ ఔషధ ధరలు

ఎన్నికల వేళ కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, మే 16: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుగాలి వీస్తున్న దన్న వార్తల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నది. సాధారణంగా వినియోగించే 41 ఔషధాలతోపాటు మధుమేహం, హృద్రోగ, కాలేయ వ్యాధుల చికిత్సలో వినియోగించే ఆరు మందుల ధరలను తగ్గించింది. యాంటాసిడ్స్, మల్టీవిటమిన్స్, యాంటిబయాటిక్స్ ధరలు దిగిరానున్నాయి. ఈ మేరకు ఫార్మాస్యూటికల్స్ శాఖ, నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) నోటిఫికేషన్ విడుదల చే